www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 14 సెప్టెంబరు 2025 5

పశ్చిమ గోదావరి

ఢిల్లీ సదస్సుకు పెనుగొండ సర్పంచికి ఆహ్వానం

పెనుగొండ: పెనుగొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి నక్కా శ్యామలాసోని శాస్త్రికి అరుదైన అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీలో ఈనెల 15వ తేదీన భారత్ నాణ్యతా మండలి(క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహించనున్న సర్పంచి సంవాద్ కాన్ క్లేవ్‌కు ఆమెకు ఆహ్వానం అందించిన పేర్కొన్నారు. జలశక్తి మంత్రిత్వ శాఖ సహకారంతో జరుగుతున్న సదస్సుకు దేశవ్యాప్తంగా 75 మంది సర్పంచులను ఎంపిక చేయగా అందులో నక్కా శ్యామలాసోని శాస్త్రి 11వ స్థానం దక్కించుకున్నారు. స్థానిక ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆశీస్సులతో గ్రామాన్ని అభివృద్ధి పరచడంలో, నిత్యం ప్రజలతో మమేకమై కృషి చేస్తున్నందుకు, గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం సమస్యల పరిష్కారంపై సర్పంచులు తమ అభిప్రాయాలు, అనుభవాలు పంచుకోనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నుండి ఎంపికైనందుకు పలువురు సర్పంచులు అభినందనలు తెలియజేశారు.

నేవీ ఆయుధ డిపోపై కొత్త నాటకం..!

- డిపో ఏర్పాటుతో పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయని కొత్త ఎత్తుగడ
- ప్రాజెక్టు నిర్మాణంలో స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి దక్కిందా
- నిర్వాసితులకు ఇప్పటికీ అందని పరిహారం
- మాటలకు, చేతలకు పొంతన లేదని పోలవరం ప్రాజెక్టులోనే నిర్ధారణ
- 'పోలవరం' భూసేకరణలో గ్రామసభలు జరపకుండా అడ్డగోలుగా తీర్మానాలు
- ఆయుధ డిపో ఏర్పాటులోనూ అలాగే వెళ్లేందుకు యత్నిస్తున్నారని చర్చ
- ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు 16న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై అధికారులు, ప్రజాప్రతినిధులు కొత్త నాటకానికి తెర లేపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమాయక గిరిజనులను ఏమార్చేందుకు ఉద్యోగాలు పెద్దఎత్తున వస్తాయని కొత్త ఎత్తుగడ వేస్తున్నారనే చర్చ సాగుతోంది. నేవీ ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ మూడుసార్లు గ్రామసభ తీర్మానం చేసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు మొండిగా ముందుకు సాగడం వెనుక ఏదో గూడుపుఠాణి జరుగుతుందనే చర్చ ఏజెన్సీ ప్రజల్లో నెలకొంది. జీలుగుమిల్లి మండలంలోని వంకావారి గూడెం, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం ఐదు గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో నిర్మించాలని మళ్లీ ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏజెన్సీలో గిరిజనుల భూములను లాక్కుంటూ, జనాన్ని ఇబ్బంది పెడుతూ ఆయుధ డిపో ఎందుకు నిర్మించాల నుకుంటున్నారనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా ఆదిలో ఏవైతే మాటలు చెప్పారో అవే మాటలను ఇప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారులు వల్లించడం చూసి అంతా విస్తుపోతు న్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదన తరుణంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగో దావరి జిల్లాల్లో లక్షకుపైగా కుటుం బాలను తరలించాలని లెక్కగట్టారు. వందల సంఖ్యలో గ్రామా లను ఖాళీ చేయించాలని తేలింది. దీనిపై గిరిజనులు ఎదురుతిరిగారు. దీంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పెద్దఎత్తున స్థానికు లకు ఉపాధి దొరుకుతుందని, నిర్వాసితుల్లో కుటుం బానికి ఒక ఉద్యోగం సైతం కల్పిస్తామని, పరిహారం పూర్తిస్థాయిలో అందించిన తర్వాతే ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని నమ్మబలికారు. గడిచిన పదేళ్లుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాగుతోంది. ఆ నిర్మాణంలో ఒక్క స్థానికుడూ ఉపాధి పొందలేదంటే అతిశయోక్తి కాదు. అక్కడ పని చేసేవారంతా ఒడిశా, ఉత్తరప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాలకు చెందినవారే. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండానే ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు ముందుకు సాగుతున్నారు. ఇప్పటికీ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 20 వేల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. భూమికి భూమిగాని, ఇళ్లకు పరిహారంగాని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఏఒక్కటీ ఇవ్వలేదు. నిర్మించిన కాలనీల్లోనూ మౌలిక వసతులు కల్పించకపోవడంతో తరలొచ్చిన నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాసితుల కుటుంబాల్లో ఒక్కరికీ కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేదు. ఇప్పటికీ వేలేరుపాడు, కుక్కు నూరు మండలాల్లో ప్రతియేటా వరదలకు కట్టుబ ట్టలతో కొండలు, గుట్టలపైనే కాలం వెళ్లదీయాల్సిన దుర్భర పరిస్థితి ఉంది. నేవీ ఆయుధ డిపోకు 1,166 ఎకరాలను సేకరించేందుకు చూస్తున్నారు. భూములన్నీ తీసేసుకుంటే గిరిజనులు ఏవిధంగా బతకాలి. పొలాల్లో పనులు లేక ఉపాధి సైతం పోతుంది. రక్షణ శాఖకు సంబంధించిన ఆయుధ డిపో వస్తే సవాలక్ష ఆంక్షలు తెరపైకి వస్తాయి. అప్పుడు ఈ ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరైనా సమాధానం చెబుతారా అంటే కంటికి కూడా కనిపించని పరిస్థితి ఉంటుంది. వేరే ప్రాంతాల్లో తిరస్కరించిన నేవీ ఆయుధ డిపోను బలవంతంగా ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేయాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు. ఆయుధ డిపో ఏర్పాటులో ప్రజలకు వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరు అంతటా చర్చనీయాంశంగా మారింది.

అడ్డగోలు తీర్మానాలతో ముందుకెళ్లే యోచనలో ఉన్నట్లు చర్చ

గతంలో మూడుసార్లు ఆయుధ డిపోకు వ్యతిరేకంగా గ్రామసభ తీర్మానం చేసింది. అయినప్పటికీ ఇప్పుడు మళ్లీ తెరపైకి తేవడం వెనుక పెద్ద కుట్ర జరుగుతున్నట్లు స్థానికుల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం పోలవరం నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో భూసేకరణ జరుగుతోంది. గిరిజనుల భూములను గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దీన్ని గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో రెడ్డిగణపవరం రెవెన్యూ పరిధిలోని భూములకు సంబంధించి వేరే గ్రామంలోని పీసా కమిటీతో తీర్మానాలు చేయించి అడ్డగోలుగా ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా ఆయుధ డిపోకు సంబంధించి అడ్డగోలు తీర్మానాలు చేసేందుకు వ్యూహాలు రచించినట్లు అందరిలోనూ చర్చ సాగుతోంది. అదే జరిగితే ప్రతిఘటన తప్పదని గిరిజనులు, గిరిజన నాయకులు హెచ్చరిస్తున్నారు. ఆయుధ డిపో ఏర్పాటు ప్రకటన నేపథ్యంలో ఈ నెల 16న జీలుగుమిల్లి మండలంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గతంలో ఆయుధ డిపోను స్థానిక టిడిపి నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పుడు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోం

కె.రవికుమార్, కొత్త సీమలవారిగూడెం పీసా కమిటీ కార్యదర్శి

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై గతంలోనే గ్రామసభ అనేకసార్లు వ్యతిరేకంగా తీర్మానం చేసింది. అయినప్పటికీ మళ్లీ తెరపైకి తీసుకురావడం దారుణం. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు ఆయుధ డిపో ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం. మరోసారి వ్యతిరేకంగా తీర్మానం చేస్తాం. అవసరమైతే ఆందోళనలు, పోరాటాలు సాగిస్తాం.

ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులు పని చేస్తున్నారు

తెల్లం రామకృష్ణ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు

ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు ముందుకు సాగడం దుర్మార్గం. ఇదంతా కావాలనే చేస్తున్నారు. ఆయుధ డిపో ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామస్తులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతాం. దీనికి సంబంధించి ముందుగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తాం.

ఆరోగ్య పరిరక్షణపై స్త్రీలకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

స్త్రీల ఆరోగ్య పరిరక్షణకు జిల్లాలో పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో స్వస్థ నారీ శసక్త పరివార్ అభియాన్ కార్యక్రమంపై (ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం) సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ స్త్రీల ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన, పరీక్షలు, చికిత్స ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. కేన్సర్ స్క్రీనింగ్, ప్రసూతి సంరక్షణ, తల్లి పిల్లల రక్షణ, ఇమ్యునైజేషన్, రక్తహీనత స్క్రీనింగ్ రక్తదానం, టిబి స్క్రీనింగ్, అధిక రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్, అనారోగ్య మహిళలకు క్షయవ్యాధి స్క్రీనింగ్, కౌమారదశలో ఉన్న బాలికలు, మహిళలకు రక్తహీనత స్క్రీనింగ్, కౌన్సెలింగ్ సేవలు, పిల్లలకు రోగనిరోధక సేవలు అందిస్తారన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ జి.గీతాబాయి, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్, డిఇఒ ఇ.నారాయణ, ఐసి డిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉచిత గాలికుంటు టీకాలు సద్వినియోగం చేసుకోవాలి

పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారణకు ఉచిత టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాల కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 15వ తేదీ నుండి అక్టోబర్ 14వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేస్తారన్నారు. పశు సంవర్ధక శాఖ సిబ్బంది ప్రతి గ్రామంలోను నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు ఉచిత టీకాలను వేయాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పశువులలో గాలికుంటు వ్యాధి వస్తే పాల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా తగ్గుతుందన్నారు. చికిత్స అందించకుండా నిర్లక్ష్యం చేస్తే పశువులు మృతి చెందుతాయని, అందువల్ల పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.మురళీకృష్ణతోపాటు వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, సిపిఒ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సేవలు ఎనలేనివి

తుదిశ్వాస వరకు ప్రజా ఉద్యమానికే జీవితం అంకితం

ప్రథమ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

సీతారాం ఏచూరి సమాజానికి అందించిన సేవలు ఎనలేనివని, ఆయన తుది శ్వాస విడిచే వరకూ ప్రజా ఉద్యమానికి జీవితం అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కొనియాడారు. స్థానిక మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమవర్ధంతి సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం చిత్రపటానికి గోపాలన్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గోపాలన్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి వారోత్సవాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. సీతారాం ఏచూరి సిపిఎంకు, కమ్యూనిస్టు ఉద్యమానికి, దేశంలోని కార్మిక వర్గానికి విశేష సేవలందించారన్నారు. పార్టీ శ్రేణులు, యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న వినాశకర పెట్టుబడీదారి, ప్రయివేటీకరణ విధానాలను ప్రజానీకం వ్యతిరేకించి పారదోలినప్పుడే అంతరాలు లేని సమాజాన్ని రూపొందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

రేషన్ డీలర్లకు కొత్త ఇ-పాస్ మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం

పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ డీలర్లకు కొత్త ఇ-పాస్ యంత్రాలను రెండు రోజులుగా పంపిణీ చేస్తున్నారు. స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో భీమవరం, పాలకోడేరు, వీరవాసరం, ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల్లోని డీలర్లకు పంపిణీ చేశారు. పదేళ్ల క్రితం ఇచ్చిన మిషన్లను ఇప్పటి వరకు డీలర్లు వినియోగించారు. అయితే మారిన టెక్నాలజీకి అనుగుణంగా కొత్త ఇ-పాస్ మిషన్లను పంపిణీ చేశామని, వీటివల్ల కార్డుదారుడు ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన అవసరం లేదని అసిస్టెంట్ పౌరసరఫరాల అధికారి రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ అధికారులు ఆదిశేషయ్య, సురేష్, సూర్యనారాయణరాజు, విజన్ టెక్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, మణికంఠ, అనిల్, మోహన్, కళ్యాణ్, పవన్, రేషన్ డీలర్ల సంఘ నాయకులు మద్ది సుబ్బయ్య, దొంగ కృష్ణ, సాయికృష్ణ, కొల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇ-పాస్ మిషన్లు అందిస్తున్న సిబ్బంది

చెరువులో జారి పడి చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి - అత్తిలి (తణుకు)

అత్తిలి మండలం రామన్నపేటలో మంచినీటి చెరువులో చిన్నారి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందిన ఘటన శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సప్పా శివ, లీల దంపతుల కుమార్తె సప్పా మహిత (3)ను తల్లి లీల అంగన్వాడీ కేంద్రానికి మధ్యాహ్న భోజనం తిన్పించేందుకు తీసుకెళ్లింది. భోజనం తినిపించే క్రమంలో చిన్నారి మహిత ఆడుకుంటూ ఎదురుగా ఉన్న చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ పడిపోయింది. ఈ విషయాన్ని గుర్తించని తల్లి లీల కొద్దిసేపటి తర్వాత చిన్నారి కోసం చుట్టుపక్కల వెతికింది. ఈ లోపు చెరువు రేవులో మెట్ల వద్ద మహిత తేలుతుండటాన్ని స్థానికులు గమనించి హుటాహుటీన తణుకులోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మహిత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహిత తండ్రి శివ టైల్స్‌వర్క్ పని చేస్తారు. తల్లి గృహిణి. వీరికి 8 నెలల బాబు ఉన్నాడు.

రోదిస్తున్న చిన్నారి కుటుంబ సభ్యులు

ఆక్వాలో ఆధునిక పద్ధతులు అవలంబించాలి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించడానికి ఆక్వా ఎక్స్‌పో ఉపయో గపడుతుందని ఎపి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. శనివారం పెదఅమిరం లోని ఆక్వా ఎక్స్ ఇండియా ఎగ్జిబిషన్ ప్రదర్శన ముగింపులో ఆయన పాల్గొని స్టాల్స్‌ను పరిశీలిం చారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడు తూ ఒకేచోట 20 దేశాల నుంచి 85 స్టాల్స్ రైతులకు అవగాహన కల్పించేలా ఏర్పాటు చేయ డం అభినందనీయమన్నారు. ఆక్వా కల్చర్‌లో ఆధునిక, సాంకేతిక, అంతర్జాతీయ పద్ధతులు అవలంభించడం ద్వారా ఉత్పత్తుల్లో ప్రగతి సాధించాలన్నారు. ఎపిఐసిసి ఛైర్మన్, మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు స్టాల్స్‌ను పరిశీలించి మాట్లాడారు. ఆక్వా రైతుల సంక్షేమం, వారి అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు. ఆక్వా ఎక్స్‌పో సిఇఒ దంతులూరి వేణు మాట్లాడుతూ ఆక్వా రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనల ప్రకారం సాంకేతికతను వినియోగించుకొని సాగు చేయాలన్నారు. ఈ ఎగ్జిబిషన్లో ఆక్వా రైతులకు ఉపయోగపడే మందులతోపాటు యంత్ర సామగ్రి కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్వా ఎక్స్ ఇండియా సంస్థ ఫౌండర్ సమీర్ పాత్ర, డాక్టర్ తరుణ్ శ్రీధర్, డాక్టర్ సికె.మూర్తి, డాక్టర్ జోడల్ ఇస్మాయిల్, వాసుదేవ దత్తు, సన్‌షైన్ ఆక్వా కేర్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యువరాజ్ అరుమూగం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎ.జేమ్స్, ఎస్.శీలం, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవి వర్మ, మంతెన ఉమా శ్రీలక్ష్మి, ఇంట్రాన్ లైఫ్ సైన్సెస్ ప్రయివేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ రాయప్రోలు శ్రీనివాస్, జోనల్ మేనేజర్ టి.సురేష్, ఆక్వా రైతులు, కొనుగోలుదారులు, సరఫరాదారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న మోషేన్‌రాజు

పలుచోట్ల వర్షం

రహదారులు జలమయం

గొల్లగూడెంలో రహదారిపై నిలిచిన వర్షం నీరు

పాలకొల్లులో..

కాళ్లలో..

ప్రజాశక్తి - మొగల్తూరు

వాతావరణ మార్పులతో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. మండల కేంద్రం మొగల్తూరులో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కురిసిన వర్షానికి రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లు మొగల్తూరు వెంప రహదారి, మొగల్తూరు సేరే పాలెం రహదారి, ముక్కువారి వీధి హైస్కూల్ వీధి, శివాలయం రోడ్డు, సాలిపేట, పేరుపాలెం, కేపి పాలెం, రామన్నపాలెం, పాతపాడు, తదితర గ్రామాల్లోని పక్క డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారులపైనే వర్షం నీరు నిలిచిపోతుంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో అంటువ్యాధులు ప్రబలుతాయని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రహదారులపై నిలిచిన వర్షపు నీటిని బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో పలుమార్లు తేలికపాటి భారీ వర్షం దంచి కొట్టింది. దీంతో వారపు సంత వ్యాపారులు తడిచి ముద్దయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మబ్బులు కాసి, చలిగాలులు వీచాయి. అయితే మధ్యాహ్నం నుంచి కొద్ది సేపు వర్షం దంచి కొట్టడం, కొంత సేపు తేలికపాటి వర్షం కురవడం జరిగింది. దీంతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. 2వ శనివారం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

కాళ్ల : శనివారం కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. మండలంలోని కాళ్ల, సీసలి, జక్కరం, కాళ్లకూరు గ్రామాల్లో రోడ్లు వర్షానికి మరింత ఛిద్రంగా మారాయి. రోడ్లన్నీ గోతులతో అసలే అస్తవ్యస్తంగా ఉండడంతో వాటిల్లో నీరు చేరి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో అంతర్గత రహదారులపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పూరిగుడిసె దగ్ధం ఘటన ప్రమాదం కాదు..

వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్‌పి భీమారావు

ప్రజాశక్తి - నరసాపురం

మొగల్తూరు నడిబొడ్డున ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి పూరిగుడిసె ఈనెల 9వ తేదీన అగ్నికి ఆహుతైన ఘటన ప్రమాదం కాదని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ఎప్పటి నుంచో ఉంటున్న పూరి గుడిసె స్థానంలో సాంప్రదాయం పక్కన పెట్టి సిమెంట్ షెడ్డు నిర్మిస్తున్నారనే కోపంతో మొగల్తూరు గ్రామానికే చెందిన చేపలు అమ్ముకుని జీవించే తోట శ్రీనివాస్ అనే వ్యక్తి తగలబెట్టినట్టు నిర్ధారించారు. శనివారం నరసాపురం డిఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు వివరాలు వెల్లడించారు. ముత్యాలమ్మ అమ్మవారి పూరిగుడిసె దగ్ధం అయిన నేపథ్యంలో సున్నితమైన ఈ అంశాన్ని పోలీసుశాఖ చాలా సీనియస్‌గా తీసుకుని, ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టిందని చెప్పారు. ఏలూరు రేంజ్ ఐజి, జిల్లా ఎస్‌పి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పడి దర్యాప్తు సాగించాయని చెప్పారు. సీసీ కెమెరాలు, సిడిఆర్, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీమ్, డాగ్స్ స్క్వాడ్ ద్వారా సాగిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించామన్నారు. భార్యతో విడిపోయి చేపలు అమ్ముకుంటూ, కూలీ పనులు చేసుకుంటూ జీవించే శ్రీనివాస్ ముత్యాలమ్మకు భక్తుడుగా ఉంటూ తరచూ పూజల్లో పాల్గొనేవాడని చెప్పారు. అయితే ఇటీవల అమ్మవారి తాటి గుడిసె స్థానంలో సిమెంట్ ప్లాట్‌ఫామ్, షెడ్డు నిర్మించాలని తీసుకున్న నిర్ణయాన్ని శ్రీనివాస్ వ్యతిరేకించాడని ఎఎస్‌పి వివరించారు. సాంప్రదాయం చెడిపోతుందనే కోపంలో, ఆవేశంతో నిప్పుపెట్టినట్టుగా దర్యాప్తులో నిందితుడు అంగీకరించాడని చెప్పారు. సీసీ కెమెరాలో నిందితుడు నీడ ద్వారా కేసు చేధించినట్లు అడిషనల్ ఎస్‌పి తెలిపారు. అనంతరం దర్యాప్తులో కీలకంగా పనిచేసిన సిబ్బందికి రివార్డులు అందించారు. ఈ సమావేశంలో నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద, పాలకొల్లు రూరల్ సిఐ జి.శ్రీనివాస్, మొగల్తూరు ఎస్ఐ జి.వాసు, వై.నాగలక్ష్మి, పాలకొలు టౌన్ ఎస్ఐ పృథ్వీ ఉన్నారు.

పాత పెన్షన్లు పునరుద్ధరించాలి

2003 డిఎస్‌సి సంఘం నాయకులు ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

2003 డిఎస్‌సి నియామక ఉపాధ్యాయులకు పాత పెన్షన్లు పునరుద్ధరించాలని కోరుతూ నియోజకవర్గంలోని 2003 డిఎస్‌సి సంఘ నాయకులు శనివారం తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ ఉత్తర్వులు రాకముందే 2003 డిఎస్‌సి నోటిఫికేషన్ జరిగిందని వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం మెమో 57ను అమలు చేస్తూ తమకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎల్‌ఎను కలిసిన వారిలో డిఎస్‌సి 2003 కన్వీనర్ ఎల్.మహేష్, కె.శివ గణేష్, అజయ్, పెద్దిరాజు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.



ఎంఎల్‌ఎకు వినతిని అందజేస్తున్న 2003 డిఎస్‌సి సంఘం నాయకులు

పలుచోట్ల లోక్ అదాలత్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) నరసాపురం, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, పాలకొల్లు ఛైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా(జూనియర్ డివిజన్) పూర్తి ఇన్‌ఛార్జి బాధ్యతలు వహిస్తున్న రొక్కం వరలక్ష్మి సారథ్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్ లో ఐపిసి కేసులు-13, ప్రొనోట్ కేసులు-3, ఇంజక్షన్ దావాలు-2, చెక్కు బౌన్స్ కేసులు-1, మనోవర్తి కేసులు-2, గృహహింస కేసులు-1, ఎక్సైజ్ కేసులు-7, బెంచ్ కోర్టు కేసులు-2 మొత్తం 31 కేసులు రాజీ చేసినట్లు తెలియజేశారు. భాధితులకు వివిధ కేసులలో మొత్తం రూ.28,04,080 పరిహారం అందేలా చేశామన్నారు. ఈ అదాలత్‌లో న్యాయవాదులు ఆర్‌వి.సూర్యనారాయణ, ప్రభాకర్, చంటి, యోహాను, పి.పూర్ణ రవిచంద్ర, శ్రీనాథ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం కోర్టు భవనాల ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో రూ.1,04,63,460 విలువ గల 421 కేసులు రాజీ అయినట్లు తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, పదకొండవ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా తెలిపారు. వీటిలో సివిల్ కేసులు 16, క్రిమినల్ కేసులు 87, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 05, ప్రీ లిటిగేషన్ కేసులు 31, బెంచ్ కోర్టు కేసులు 282 రాజీ అయినట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ఐదు బెంచులుగా నిర్వహించినట్లు తెలిపారు. 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా, సీనియర్ సివిల్ జడ్జి కె. మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణశ్రీ, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా దేవి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి జ్యుడీషియల్ మెంబర్లు, దూలం విజయ్ కుమార్, పి.భూపాల్, ఎస్.రామకృష్ణ, బి.వెంకటేశ్వరరావు, టి.జగదీష్ అడ్వకేట్ నెంబర్లుగా వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిరిగినీడి విజయకృష్ణ కక్షి దారులకు పులిహోర పొట్లాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, అడ్వకేట్లు, కక్షిదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు : జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 650 కేసులు రాజీ చేశారని ఛైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలియజేశారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ సివిల్ కేసులు 23, క్రిమినల్ కేసులు 605, ప్రీ లిటిగేషన్ కేసులు 22 రాజీ చేశారన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకొనుట వల్ల విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చునని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న కేసులు మీడియేషన్ ద్వారా రాజీ చేసుకోవచ్చునని కక్షిదారులకు తెలియజేశారు. డిసెంబర్ నెలలో జరిగే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.కృష్ణ సత్యలత, శ్రీసాయిరాం, బెంచ్ మెజిస్ట్రేట్ తాడిఆంజనేయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

శ్రీవాసవి జిఎంఆర్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కృషి, పట్టుదలతో విద్యార్థులు తమ జీవిత గమ్యస్థానాలను సాధించాలని శ్రీవాసవి జిఎంఆర్ డిగ్రీ కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ సూచించారు. స్థానిక శ్రీవాసవి జిఎంఆర్ డిగ్రీ కాలేజీలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. సీనియర్లు జూనియర్లకు క్రమశిక్షణ, చదువు పట్ల శ్రద్ధ, పరస్పరం గౌరవించుకోవడం ద్వారా సమాజంలో ప్రత్యేక స్థానంతో పాటు, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వి.లక్ష్మీనారాయన్ మాట్లాడుతూ కాలేజీలో వచ్చినటువంటి ఉద్యోగావకాసాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కళాశాలలో విద్యతోపాటు, కళాశాలలో నిర్వహిస్తున్న క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగావకాశాలు పొందాలని, విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఇడి కళాశాల ప్రిన్సిపల్ హిమబిందు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్సులతో అందరినీ అలరించారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

మాట్లాడుతున్న ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ

శ్రీవాసవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో..

ప్రతి విద్యార్థికి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని శ్రీవాసవి డిగ్రీ కళాశాల ఛైర్మన్ ఎన్‌వి.రమణ రావు అన్నారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం రోడ్డులో గల కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని తరగతులకు అందుబాటులో ఉండే విధంగా ఫీజులు నిర్ణయించి సేవాభావంతో కళాశాల నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యాబోధనతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు తదితర అంశాలలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ మద్దాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఉత్తమ విద్యను అందించడం ద్వారా మంచి భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మండ బ్రహ్మాజీ, కోశాధికారి నున్న సుందరం, ఉపాధ్యక్షులు పెనుగొండ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ పలివెల ఏకాంబేశ్వరరావు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో ఎంఎల్ఎ పర్యటన

నరసాపురం : నరసాపురం పట్టణంలో శనివారం ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా 7, 8వ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ వార్డు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని, ప్రజల సమస్యలను ఇంటి వద్దకే వెళ్లి తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. అదేవిధంగా ఆయా వార్డుల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత పొత్తూరి రామరాజు, మున్సిపల్ ఛైర్మన్ వెంకట రమణ, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, కొల్లు పెద్దిరాజు, ఆకన చంద్రశేఖర్, కోటిపల్లి సురేష్, పోలిశెట్టి శ్రీనివాస్, వలవల నాని, బందేల రవీంద్ర, గంటాకృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం టిడ్కో గృహ సముదాయాల్లో నివసిస్తున్న కూరగాయల వ్యాపారి తిరుపతి వెంకటరమణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో జనసేన క్రియాశీల సభ్యులకు అందించే క్రియాశీల సభ్యత్వం ద్వారా వచ్చే బీమా రూ.5 లక్షల చెక్కును శనివారం వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కుటుంబానికి పెద్ద దిక్కు అయిన తిరుపతి వెంకటరావు మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరమన్నారు. వెంకట్రావు కుటుంబానికి ఏ అవసరం వచ్చినా జనసేన అండగా ఉంటుందని, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను మీ కుటుంబానికి అందే విధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి పార్థసారధి పుట్టినరోజు

భీమవరం టౌన్ : టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి పుట్టినరోజును పురస్కరించుకొని వారి స్వగృహం వద్ద భీమవరం నియోజకవర్గ కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి, కూటమి నాయకుల సమక్షంలో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ఎవరికి ఏకష్టం వచ్చినా తానున్నానంటూ కార్యకర్తలకు అండగా నిలబడే మొదటి వ్యక్తి మెంటే పార్థసారథి అని, కార్యకర్తలకు ఆయనొక ధైర్యమని అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ యుక్త వయసు నుండి రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన మెంటే పార్థసారథి అంచలంచెలుగా రాష్ట్ర నాయకునిగా ఎదిగారని, ఎన్‌డియే ప్రభుత్వంలో ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఎపి మహిళ ఆర్థిక సహకార కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత, భీమవరం పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. టిడిపి నాయకుడు అంగర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని అనాధలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వెంద్ర శ్రీనివాస్, కృష్ణ బలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఇందుకూరి రామలింగరాజు పాల్గొన్నారు.

పాడి పశువులకు దాణా పంపిణీ అభినందనీయం

సర్పంచి గుబ్బల మాధవరావు

ఆచంట: రైతు సంక్షేమమే ధ్యేయంగా పాడి పశువులకు దాణా పంపిణీ చేయడం అభినందనీయమని సర్పంచి గుబ్బల మాధవరావు అన్నారు. ఎంఎల్ఎ పితాని పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు 115 మంది రైతులకు 7 మెట్రిక్ టన్నుల సమీకృత దాణాను శనివారం భీమలాపురం గ్రామంలో రైతులకు సర్పంచి చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాధవరావు మాట్లాడుతూ ఇటీవల గోదావరికి వరదలు వచ్చిన నేపథ్యంలో పశుగ్రాసం కొరత ఏర్పడడంతో ఎంఎల్ఎ పితాని దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన స్పందించి ప్రభుత్వ పరంగా 115 మంది రైతులకు 7 మెట్రిక్ టన్నుల సమీకృత పశువుల దాణా అందజేయడం జరిగిందన్నారు. ఈ దాణా పంపిణీ ద్వారా పాడి రైతులకు ఆహార భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి నాయకత్వం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు.

పవిత్రోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

కాళ్ల: కాళ్లకూరులో స్వయంభూ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 20 వరకు సప్తనది జలాభిషేక పూర్వ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఇఒ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఆలయ అర్చకులతో కలిసి పవిత్రోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ ఇఒ

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నరసాపురం : మండలంలోని రుస్తుంబాద గ్రామం సమీపంలో నరసాపురం ప్రధాన కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. శుక్రవారం గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతిరాలు ఒంటిపై ఎరుపు రంగు చీర, తెల్ల చుక్కల డిజైన్ కలిగిన గచ్చకాయ రంగు జాకెట్ ధరించి ఉన్నారు. వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీసులు సెల్ నెంబర్ 94407 96616 సంప్రదించాలని ఆయన తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పెనుగొండ : తాళం వేసి ఉన్న ఇంట్లో రెండు కాసుల బంగారం, 400 వెండి చోరీ జరిగిందని పెనుగొండ ఎస్ఐ కె.గంగాధర్ తెలిపారు. పెనుగొండలోని చెరుకువాడకు చెందిన బిక్కవోలు వెంకట సూర్య భాస్కర కేశవ రామాచార్యులు నాలుగు రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వేరే ఊరికి వెళ్లి శనివారం తిరిగివచ్చారు. ఇంటికొచ్చి చూసేసరికి బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు పెనుగొండ పోలీస్ వారికి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.గంగాధర్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వరిలో ఆకు ఎండు తెగులు..

తెగులు ఆశించిన పొలంలో యూరియా వేయకూడదు

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

వ్యవసాయాధికారి

ప్రజాశక్తి - కాళ్ల

వానకాలంలో సాగుచేసిన వరిపంట మొన్నటి వరకు మురిపించింది. నిన్నటి వరకూ ఎండలు దంచికొట్టడంతో వాతావరణ మార్పులు వరి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. యూరియాను అధిక మోతాదులో వాడడమే దీనికి కారణమంటున్నారు వ్యవసాయశాఖ అధికారులు. ఈనెలలో మబ్బులతో కూడిన వాతావరణం, రెండు, మూడు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలు, తక్కువ ఉష్ణోగ్రతలు, తదితర పరిస్థితులు వరిలో ఆకు ఎండుతెగులు ఆశించడానికి దోహదం చేస్తాయి. నారుమడి దశ నుంచి గింజ పాలు పోసుకునే వరకు తెగులు ఆశించే అవకాశం ఉండడం, చెట్టు నీడ పడే ప్రదేశంలో ఎక్కువగా ఆకుఎండు తెగులు ఆశించి మిగిలిన పంటకు వేగంగా వ్యాపిస్తోంది. మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు 3 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. ఎంటియు 1443 అనే రకం 140 రోజుల కాలపరిమితి మొదటి సంవత్సరం చిరుదశలో కలదు. దిగుబడి ఎకరానికి 38 బస్తాలు వస్తుంది. మూడు వారాల నిద్రావస్త కలిగి ఉంటుంది. తెలుపు ధాన్యపు గింజలను కలిగి ఉంటుంది. అగ్గి తెగులు, ఎండాకు తెగులు దోమ పోటు, ఉల్లికోడు కొంతవరకు తట్టుకుంటుంది. మధ్యస్త సన్నగింజ నాణ్యత గల రకం మొలక దశలో ముంపు మూడు వారాల పాటు(విత్తిన 15 రోజుల్లోపు) కాండం ధృఢంగా ఉండి చేనుపై పడిపోదు. అదేవిధంగా జిఆర్ఎల్ 7045 అనే రకం మధ్యస్త సన్న రకం కాండం ధృఢంగా ఉండి దాదాపు చేను పడిపోదు, పచ్చి బియ్యానికి అత్యంత అనుకూలం. దిగుబడి ఎకరానికి 32 బస్తాలు వస్తుంది.

బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు

ఈ తెగులు కలుగచేయు బ్యాక్టీరియా ఆకుల లోపలికి ప్రవేశించడం వల్ల ఆకుల అంచుల నుండి పసుపు రంగు నీటి డాగు మచ్చలుగా ఏర్పడుట, ఆకుల అంచుల నుండి ఎండిపోవుట జరుగుతుంది. ఈ తెగులు నారుమడి దశలో ఆశిస్తే మొక్కలు కుళ్లి ఎండిపోతాయి. దీనిని క్రేసెక్ దశ అంటారు. గాలి, వానతో కూడిన వర్షం, మంచు పడుట వల్ల ఈ తెగులు అభివృద్ధి చెంది వ్యాపిస్తుంది. ఈ తెగులు యాజమాన్యానికి మందులు లేవు. కనుక తెగులు తట్టుకునే రకాలను సాగుచేసుకోవాలి. తెగుల ఉధృతి ఉన్నప్పుడు నత్రజని ఎరువుల వాడకం తాత్కాలికంగా నిలుపు చేయాలి. తెగులు ఆశించిన పొలంలో నీటిని ఎక్కువ రోజులు నిలువ ఉంచకుండా బయటకు మురుగు నీటి కాలువల ద్వారా పంపాలి. పొటాష్ ఎరువును నాటే ముందు అంకురం ఏర్పడు దశలో వాడాలి. అయితే ఈ వానకాలంలో ఎక్కువగా సన్నరకం వంగడాలను సాగు చేయడం వల్ల ఈ రకానికి ఎక్కువగా తెగుళ్ల వచ్చే అవకాశం ఉంది. రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడులు సాధించుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తెగులు గుర్తించే విధానం..

వరి పంటలో ఆకుఎండు తెగులు సోకిన ప్రదేశంలో ముందుగా ముదురు ఆకులకు పసుపు రంగు మచ్చలు ఏర్పడి పైనుంచి కింది అంచుల వెంబడి వ్యాపించి ఎండుతూ వస్తాయి. ఉదయం సమయంలో గమనిస్తే ఆకుల మీద పసుపు రంగు జిగురు ముద్దలు కనబడతాయి. ఎండ వేడిమికి గట్టిపడి రాలిపోతాయి. ఈ ఎండిన బ్యాక్టీరియా ముద్దలు నీటి ద్వారా వెళ్లి మిగిలిన పంటకు వ్యాపిస్తోంది.

తెగులు ఆశించిన పొలంలో యూరియాను వేయకూడదు

పి.రమేష్ నాయుడు, మండల వ్యవసాయాధికారి, కాళ్ల



బ్యాక్టీరియా వ్యాప్తి నివారణకు తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూసుకోవాలి. తెగులు ఆశించిన పొలంలో యూరియాను వేయకూడదు. కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ 4 గ్రాములు లేదా పోషామైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్ నాలుగు గ్రాములు పది లీటర్ల నీటిలో కలిపి 2 నుంచి 3 సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేయాలి.

అధ్యాపకులు అంకిత భావంతో పనిచేయాలి

డిఐఇఒ ప్రభాకర్ రావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖ అధికారి జి.ప్రభాకర్ రావు అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న రసాయన శాస్త్ర అధ్యాపకులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు శనివారం తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ప్రధాన అధ్యాపకురాలు నాగవేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభాకర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో ప్రభుత్వం పలు మార్పులు తీసుకువస్తుందన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పాఠ్యపుస్తకాలు, మార్కుల్లో మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. అధ్యాపకులు మారిన పుస్తకాలకు అనుగుణంగా విద్యాబోధన చేసి విద్యార్థులను చైతన్యవంతం చేయాలన్నారు. బోధనలో భాగంగా ఒక విషయంపై వివరించి విద్యార్థులతో రాయించాలన్నారు. అలాగే నీట్, ఎంసెట్ వంటి వాటిపై శిక్షను ఇవ్వాలన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జరగబోయే పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి లక్ష రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. కాబట్టి అధ్యాపకులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు బాల్యం నుండి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. బాగా చదివి మంచి మార్కులు సాధించి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపల్ నాగవేణి మాట్లాడుతూ యువత సమాజానికి ఎంతో అవసరమన్నారు. మంచి విద్యాబుద్ధులు నేర్చుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఐఇఒ ప్రభాకర్‌రావు

శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయ నిర్మల, గౌరవ అతిథిగా ఎపిఎస్ సిహెచ్ఇ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ షేక్ సులేమాన్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ గీతంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ పి.విజయ నిర్మల మాట్లాడుతూ మన సమాజానికి అమ్మాయిల చదువు చాలా అవసరమని, చదువుకున్న అమ్మాయిల వల్లే మంచి సమాజం నిర్మితమవుతుందన్నారు. ఒత్తిడి లేని విద్యా ప్రణాళిక ప్రతి ఒక్క విద్యార్థి ఏర్పాటు చేసుకుని, ఉన్నత లక్ష్యం దిశగా కృషి చేయాలని సూచించారు. గౌరవ అతిథి డాక్టర్ షేక్ సులేమాన్ మాట్లాడుతూ వ్యక్తిత్వ విలువలు, అనుభవాన్ని గౌరవించడం చాలా అవసరమన్నారు. జీవితంలో అద్భుతంగా రాణించాలంటే బాగా చదవాలి, బాగా రాయగలగాలి, బాగా మాట్లాడగలగాలి ఈ మూడు అంశాలను నేర్చుకుంటే, కోరిన ఏ విజయమయినా సాధించవచ్చునన్నారు. వందేళ్ల జీవితానికి ఈ మూడు సంవత్సరాల డిగ్రీ చదువు చాలా అవసరమని తెలియజేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీలో ఉన్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీసూర్య విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.పుల్లారావు, అకడమిక్ ప్రిన్సిపల్ టి.కృష్ణగుప్తా, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎఆర్ఎస్.కుమార్, బి.రామచంద్రారెడ్డి, డాక్టర్ ఫాజల్, డాక్టర్ కె.జానకీరామ్, డాక్టర్ ఆర్.సతీష్, వేణుగోపాల్, సిహెచ్.కరుణకుమార్, కేశవ, సత్య, రామకృష్ణ, మహేశ్వరిలతోపాటు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్ విజయ నిర్మలను సన్మానిస్తున్న కరస్పాండెంట్ బ్రహ్మాజీ

గాంధీ లేని లోటు తీరనిది

ఆర్యవైశ్య సంఘ నాయకులు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆర్యవైశ్య సంఘానికి అనంతపల్లి గాంధీ లేని లోటు తీరనిదని ఆ సంఘ మండల శాఖ అధ్యక్షులు అనంతపల్లి హరినాథ్ బాబా, మొగల్తూరు అధ్యక్షులు సంక ముత్య రామనాగేశ్వరరావు అన్నారు. ఆర్యవైశ్య సంఘ మండల మాజీ అధ్యక్షులు అనంతపల్లి గాంధీ(93) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. గాంధీ భౌతికాయాన్ని సంఘ సభ్యులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంఘ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారన్నారు. సంఘ సభ్యులు వారి దుకాణాలు మూసివేసి సంతాపం తెలిపారు. ఆయనకు భార్య కుసుమ, కుమారుడు, కోడలు, ఇరువురు మనవళ్లు ఉన్నారు.



19న ఎస్ఆర్‌కెఆర్‌లో జనరేటివ్ ఎఐపై వర్క్ షాప్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 19వ తేదీ శుక్రవారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జనరేటివ్ ఎఐ' అనే అంశంపై అధ్యాపకులకు ఒకరోజు వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఎస్‌డి హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్(సిఎస్‌డి), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(సిఎస్ ఐటి) ఫ్యూచర్ ఒఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న జనరేటివ్ ఎఐ రంగం గురించి అధ్యాపకులు అధ్యయనం చేస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. జనరేటివ్ ఎఐ రంగంలో విశేష అనుభవం ఉన్న పరిశ్రమ రంగ నిపుణులు హాజరై వర్క్ షాప్‌లో నూతన టెక్నాలజీని అందించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.ప్రవీణ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల కరస్పాండెంట్ నిస్సాంత్ వర్మ

ఆశ్రయమిస్తే కబ్జా చేసేశారు..

న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి - ఉండి

బంధువులే కదా అని కనికరం చూపించి ఆశ్రయమిస్తే ఏకంగా తమ ఇంటిని కబ్జా చేశారని, అంతేకాకుండా తమపై తప్పుడు కేసులు పెడుతూ తమ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఉండి గోరింతోటకు చెందిన కొల్లి సుందరం ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొల్లి సుందరం మాట్లాడుతూ ఉండి గోరింతోటలో తనకు సుమారు 10 సెంట్ల స్థలంలో ఇల్లు ఉందని దానిని తనకు తన ముత్తాత కొల్లి వరదయ్య ద్వారా పూర్వపు ఆస్తిగా సంక్రమించగా తన పెద్దమ్మ కొల్లి సుశీలమ్మ 2012లో తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించారని, 2018లో తన కుమారుడు ప్రఖ్యాత పేరిట తాను రిజిస్ట్రేషన్ చేయించానన్నారు. అటువంటి ఇంటిని తనకు వరుసకు చెల్లెలు అయిన మేడపాటి రోజా రాణి కుటుంబ సభ్యులతో కలిసి ఆక్రమించుకోవాలని చూస్తున్నారని కొల్లి సుందరం వివరించారు. తాను హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులతో వ్యాపార నిమిత్తం నివాసం ఉండడంతో ఇక్కడి ఇల్లు ఖాళీగా ఉండగా మేడపాటి రోజా రాణి, ఆమె భర్త ఆమోస్ ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్నామని, అద్దె కూడా చెల్లించుకోలేని పరిస్థితిలో తాము ఉన్నామని, ఖాళీగా ఉన్న ఇంటిలో ఆశ్రయం ఇవ్వాల్సిందిగా కోరగా మానవత్వంతో ఆ ఇంటిలో ఉండేందుకు తాము అంగీకరించామన్నారు. తన పెద్దమ్మ సుశీలమ్మ మరణించిన తర్వాత హైదరాబాద్ నుంచి మేము ఉండి వచ్చేస్తున్నామని తమ ఇల్లు ఖాళీ చేసి ఇవ్వాల్సిందిగా రోజా రాణి దంపతులకు తెలియపరచగా ఖాళీ చేసేది లేదని, ఇది తమ ఇల్లని తనకు ఎదురు తిరగడంతో 2019లో పోలీసు కేసు పెట్టడం జరిగిందన్నారు. పోలీసులు వచ్చే సమయంలో రోజా రాణి బట్టలు చింపుకొని పోలీసులపై దౌర్జన్యానికి దిగిందని దీంతో వారు వెనుతిరిగి కోర్టులో తేల్చుకోవాల్సిందిగా తనకు చెప్పారని, నాడు కోర్టులో కేసు వేయగా 2023లో తీర్పు తనకు అనుకూలంగా వచ్చిందని తీర్పు కాగితం చూపించి ఇల్లు ఖాళీ చేయాలని చెప్పినప్పటికీ రోజా రాణి దంపతులు తనపై, తన కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడి ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి నుంచి తమ ఇంటిని ఎవరికి అద్దెకు ఇవ్వనీయకుండా అద్దెకు వచ్చిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని, బట్టలు చింపుకుని రేప్ కేసులు పెడుతున్నారని వారు తెలిపారు. 2019లో తన పెద్దమ్మ కొల్లి సుశీలమ్మ చనిపోయేముందు మేడపాటి రోజా రాణికి ఇల్లు రాసి ఇచ్చినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టులో ఫోర్జరీ సంతకాలతో కేసు వేశారని, పైగా ప్రభుత్వ స్థలంలో తన ఇల్లు ఉందని అవాస్తవాలు సృష్టించి తన ఇంటి నెంబరు వేశారని, త్వరలోనే తనకు పూర్తిగా అనుకూలంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లూథరన్ చర్చి మాజీ సంఘ పెద్దలు కొల్లి ఏసురత్నం మాట్లాడుతూ మేడపాటి రోజా రాణి తనకు వరుసకు చెల్లెలు అవుతుందని, అత్యాశకులోనై కొల్లి సుందరంకు చెందిన ఇంటిని కాజేయాలని చూడటం సరికాదని, దీనివల్ల మానవ సంబంధాలు పూర్తిగా చెడిపోతాయన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పులను సరిదిద్దుకుని సుందరంపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని వారు కోరారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

ఘనంగా ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుక

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక బిఆర్ఆర్, జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఘనంగా స్వాగతం పలుకుతూ నిర్వహించే ఫ్రెషర్స్ డే ఆనంద సంతోషాలతో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎస్‌కె.సులేమాన్ అకాడమిక్ కన్సల్టెంట్, ఎపి ఉన్నత విద్యామండలి డాక్టర్ ఎస్‌కె.సులేమాన్, కాస్మోపాలిటన్ కల్చరల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెక్రటరీ వేగి వెంకట సోమరాజు విచ్చేసారు. ఈ కార్యక్రమంలో సులేమాన్ మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమని, నేడు యువతలో క్రియేటివ్ థింకింగ్, లాజికల్ అప్రోచ్, డెసిషన్ మేకింగ్, డీప్ సీకింగ్, అర్థమెటిక్, ఇంగ్లీష్, రీజనింగ్ స్కిల్స్ లాంటి నైపుణ్యాలు మంచి ఉద్యోగ అవకాశాలను తెచ్చి పెడతాయని చెప్పారు. డాక్టర్ సులేమాన్ హెచ్ఆర్‌డి సెంటర్ ద్వారా 4 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామని, అదే సంస్థను విస్తరణలో భాగంగా ఛాంబర్స్ కళాశాలలో కూడా ఏర్పాటు చేసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. మంచిగా ఉద్యోగావకాశాల ద్వారా కెరియర్ గైడెన్స్, ఉద్యోగ అవకాశాలు కల్పన జరుగుతాయన్నారు. కళాశాల ఛైర్మన్ కెవి.నరసింహారావు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నేటి యువత మీద ఉందన్నారు. వినయం, విధేయత, మంచి సాంప్రదాయాలు మొదటి సంవత్సరం విద్యార్థులకు స్నేహభావం, వారిలో ఉన్న భయాలను పోగొట్టి వారిని తమ లక్ష్యాలకు అనుగుణంగా నడుచుకునే విధంగా వారికి ఆహ్వానం పలుకుతూ ఒక సత్ సాంప్రదాయాన్ని తమ కళాశాలలో నిర్వహించుకోవడం సంతోషదాయకంగా ఉందని అన్నారు. మరో ముఖ్య అతిథి వేగి వెంకట సోమరాజు మాట్లాడుతూ ఛాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మధ్య, దిగువ మధ్యతరగతి కుటుంబ విద్యార్థులకు అందుబాటులో మంచి నాణ్యత ప్రమాణాలతో విద్యను అందించడమే కాకుండా వారికి ఉద్యోగ కల్పనలో అమితమైన కృషి చేస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, స్నేహ భావం, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలు అలవడతాయన్నారు. కళాశాల సెక్రటరీ కెవి.సీతారామరాజు మాట్లాడుతూ విద్య, వినయం, క్రమశిక్షణ, నైపుణ్యం సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు అలవాటు చేసి వారి భవిష్యత్తుకు ఉన్నత పునాదులు వేయాలని, అలాగే ఛాంబర్స్ కళాశాలకు ఇటీవల ఐఎస్ఒ గుర్తింపు రావడంతో కళాశాల ఉన్నతస్థాయి ప్రమాణాలను ఇది ఒక తార్కాణమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. తదుపరి కళాశాలలో అకాడమిక్ మెరిట్, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ద్వారా సత్కరించారు. కళాశాల అడిషనల్ ఛైర్మన్ తటవర్తి కృష్ణమూర్తి, అకాడమిక్ డైరెక్టర్ ఎబిఎస్ మూర్తి, నందుల సీతారామరావు, ట్రెజరర్ ప్రవీణ్ భాను, కటారీ నాగేంద్ర కుమార్, దేవరపు లక్ష్మీనారాయణ, కళాశాల డోనర్స్ వేగేసిన రంగరాజు, విశ్వనాథరాజు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కెఎన్‌వి.నరసింహారావు పాల్గొన్నారు.

శ్రీమావుళ్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పట్టణంలో వేంచేసియున్న ప్రముఖ ఇలవేల్పు, ఆరాధ్యదైవం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి శాశ్వత నిత్య అన్నదాన వితరణకు భీమవరంకి చెందిన ఎం.వెంకట గోపాల సత్యనారాయణ శర్మ కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు అందజేశారు. వారి సంస్థ శ్రీఖర ఇంజినీరింగ్ సర్వీసెస్ భీమవరం పేరుమీద ఆలయ సహాయ కమిషనర్, ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కి అందజేశారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

పాస్‌పోర్టు పోయినది

నక్కా రాధా కుమారి, తండ్రి: దేవ మాషెన్ రావు, డోర్ నెంబర్ 10-63, పైడావ దుర్గమ్మ చెరువు గుమ్ములూరు, పోడూరు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి ది 20-06-2017 న R2775605 నెంబర్ పాస్ పోర్ట్ పొంది యున్నాను. నేను ది 5-9-2025న మా ఇంటి నుంచి పెనుమదం సెంటర్‌లో నా ఒరిజినల్ పాస్ పోర్ట్‌తో జెరాక్స్ కాపీలు తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో పడి పోయినవి. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 8790223825

పబ్లిక్ నోటీసు

నా క్లయింటున్నూ కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు పట్టణం, డి.ఎ.ఆర్. కాలేజ్ దగ్గర, డోరునెం.20-207లో నివాసం వుంటున్న మేకా రాజగోపాల్ గారి కుమార్తె మేకా ఇందువర్ష, వయస్సు 33 లు, ఆధార్ నెం.3369 6642 8557, నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా : - నా క్లయింటు నూజివీడు పట్టణ కాపురస్తులు అయివున్నారు. నా క్లయింటుకు X7371706 అను నెంబరు పాస్‌పోర్టు కలదు. ఇట్లుండగా ది.11-09-2025వ తేదీన ఉదయం సుమారు గం.10.30 ని॥ల సమయంలో సదరు పైతెలిపిన ఒరిజినల్ పాస్‌పోర్టును కవరులో పెట్టుకొని నా క్లయింటు చిన్నగాంధీ బొమ్మ సెంటరులో గల జిరాక్సు షాపు వద్దకు వెళ్ళగా, దారి మధ్యలో సదరు పాసుపోర్టు పెట్టిన కవరు ఎక్కడో జారి క్రింద పడిపోయినది. దానిపై నా క్లయింటు వచ్చిన దారిలో మరియు ఆ చుట్టు ప్రక్కల వెతికి చూసినప్పటికీ సదరు ఒరిజినల్ పాస్‌పోర్టు కనపడియుండలేదు. కావున పై తెలిపిన ఒరిజినల్ పాస్‌పోర్టు ఎవరికైననూ దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అందజేయగలరు. పాస్‌పోర్టు యిచ్చిన వారికి తగిన పారితోషికం యివ్వబడును.

ఇందుపల్లి సత్యప్రకాష్,
న్యాయవాది,నూజివీడు
సెల్: 9603034999